

# నీటి ఎడారులు

ఎ. మురళీకృష్ణ

అదే జ్ఞాపకం... ఉన్నట్టుండి గుర్తుకు వచ్చిందామె. ఎక్కడో చూసిన స్మృతి. అవును... ఓ రోజు ఆఫీసు పని మీద భాగ్యనగరం వెళ్ళినప్పుడు, ఏదో సాహితీ కార్యక్రమం ఉందంటే... అటు వెళ్ళాను. అప్పుడే ఈ 'విరజాజి'ని కలిశాను. ఆ రోజు ఎంత చక్కగా ఆధునిక రచయిత/త్రులను విమర్శించిందీమె? ఆధునికులే కాదు, ప్రాచీన శృంగార కవుల్ని కూడా ఘాటుగా విమర్శించింది.

సామాజిక స్పృహలేని, తమ సమస్యలకు ఓ పరిష్కార మార్గం సూచించలేని, అసహజపు నవలా రచయితల్నే కాదు. శృంగారము పవిత్రంగానూ, నిర్మలంగానూ ఉండాలని, కల్మషమైనదిగా ఉండకూడదని, ఏకాంతంగా ఉండాలి కాని, మరి ఏ కాంతలతోనూ ఉండకూడదని, చాటున వెలుగులు చిమ్మాలి గాని, బహిర్గతమై వెగటు పుట్టించేదిగా ఉండకూడదని, చెలికత్తెలు సైతం తమ నేస్తాన్ని శోభనపు గది వెలుపల వదిలిపెడ్తారు గాని, ఈ కవులు మాత్రం ఆసాంతం శృంగారం పేరిట అసభ్యవర్ణన. చేస్తారని, స్త్రీలను కించపరిచేవిగా వీరి కావ్యాలు ఉన్నాయని ఎంతో స్పష్టంగా విమర్శించిందీమె. ఆ రోజు ఆమెపై ముగ్ధుడనై,

అభినందనలు తెలియజేసినా... దాదాపూ మర్చిపోయా ననే చెప్పాలి.

మళ్ళీ ఈ రోజు... ఇక్కడ.... నా కెదురుగా....

"మీరు....." సందిగ్ధంగా అడిగాను.

'నేను రాజ్యలక్ష్మిని' నుత్తరంగా నవ్విందామె. ట్రైన్లో, కంపార్ట్‌మెంట్ అంతా ఖాళీయే. ఆమె, నేను తప్ప ఎవ్వరం లేము. ఫర్లేదు, డిస్టుర్బెన్స్ లేకుండా మాట్లాడుకో వచ్చు.

'ఎందాకా?' నా ప్రశ్న.

'వైజాగ్' మాటలేమీ పొడిగించకుండానే. కానీ, నన్ను గుర్తు పట్టినట్లే ఉంది.

ఏదో పుస్తకం తీసి చదవసాగింది.

'ఏం చదువుతున్నారు?'

'అమృతం కురిసిన రాత్రి'

'అరె.... ఇంతవరకూ మీరిది చదవలేదా?' చాలా ఆశ్చర్యపోయాను నేను.

"నేనిది చదవటం ఎన్నిమార్లో నాకే గుర్తు లేదు. అంతగా కదిలించింది నన్నిది...."

అదిగో, అప్పటినుంచే నన్నూ... అదే, నా హృదయా న్నీ కదిలించిందామె.

ఎన్నో మాటలు, అపురంపు మాటలు, అలవోక పాట లు ఒకటేమిటి ఎన్నో లేఖలు. అన్నీ గాలి నీలాల పాటలే..... పూల నెత్తావి మాధురులే... స్నేహ ఝరులే.

ఆమె లేఖల్లో ఏదో శ్రుతి... మరేదో ప్రీతి కనిపించేవి. కానీ, అవేనాడూ తమ ఔన్నత్యాన్ని కోల్పోలేదు.

ఓమారు లేఖలో... రవీంద్రభారతిలో ఏదో సాంస్కృతిక కార్యక్రమానికై తాను వస్తున్నట్లు వ్రాసింది. నేనూ హైదరాబాద్ వెళ్ళి హొటల్లో రూమ్ తీసుకున్నా ను. నేను తలచినటులే.... నా నిరీక్షణలన్నీ మామూలు గానే సాగి... ఆమె వచ్చింది. ఆమె 'రాక' వలపు ఏరువాకలా తోచింది నాకు. ఆమె 'రాక'తో నా పాటల తోటంతా పల్లవించింది.

ఎప్పటిలా కబుర్లు... మాటల మధ్యలో ఆమె గతం నా మనసునే మార్చివేసింది. ఆమెకు వివాహమైందట. అది కాదు నా బాధ, తన వివాహానికి నన్ను ఆహ్వానించ లేదు. అదే అడిగాను.

"బాగుంది విశ్వం! మన పరిచయానికి ముందే వివాహమైంది. మరి, నిన్నెలా పిలవటం? అయినా ఓ విషయం, నేను నా భర్తని విడిచిపెట్టి చాలా కాలమైంది. నా భర్త కురూపే కాదు, కుసంస్కారి కూడా."

ఒక్క లిప్తలో ఆమె పైని అభిమానపు పొరలు తొలగిపోయాయి. ఆమెపైని సదభిప్రాయమూ తుడిచిపె ట్టుకొని పోయింది. సంస్కారం తెలిసిన మనిషైతే ఇట్లా ఒంటరిగా ప్రయాణాలు చేస్తారా? మగ స్నేహితులు ఉంటారా?

అయినా, ఇన్నాళ్ళూ ఈమె నాతో ఎందుకు చెప్పలే దు? పైగా, నేనే విడిచి పెట్టానని ఎంత సగర్వంగా చెప్తోంది? భర్త ఎటువంటి వాడైనా, అతనికి అనుగు ణంగా ఉండాలి కాని, ఇట్లా వదిలేయడమేనా? మరి, మళ్ళీ తనతో ఈ సాన్నిహిత్యం ఏమిటి? భర్త కురూ పిట... బహుశ తనకి వల వేయాలన్న ఆలోచనేమో! ఓహ్... ఈమె మెదడంతా తుచ్ఛపు బుద్ధులే. ఇన్నాళ్ళూ ఎంత పవిత్రురాలిగా, అనాఘ్రాత పుష్పంలా నటించింది. ఎంత నటన! బాబోయ్ ఈమెకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. మైగాడ్ తృటిలో

ఓ కథెట్లా రాయాలంటే... కాగితం మీద రాయాలంటా డు ఒక సుప్రసిద్ధ రచయిత, ఎట్లా రాయాలనేది ఎవ్వరూ చెప్పలేరు. కాల్పనిక సాహిత్యంలో వైయక్తిక సృష్టి కథ. వస్తున్న కథలిటువంటివి. గుణాలిటువంటివి. ప్రయోజనం ఇది అని చెప్పుకోవాలి. కానీ కథ ఇలాగే రాయాలి అని చెప్పటానికి మనకి అధికారం లేదు

-విద్వాన్ విశ్వం

తప్పిపోయింది ప్రమాదం. తన జాలి కథకు సినిమాల్లో నవలల్లోలా కదలిపోయి పెళ్ళి చేసుకుంటానను కుంటోంది.

చెడు తలంపులు రావటం మొదలుపెట్టే ఒక పట్టాన పోవు. శేఖర్, నా ప్రియమిత్రుడితో చెప్పాను నా ఆలోచన లు. కానీ, ఆమె నా కోసం వచ్చినపుడు నా మాటలన్నీ విన్నదేమో...చాలా ముభావంగా నా రూమ్‌లో అడుగు పెట్టింది.

"విశ్వం! ఇక్కడికి నేనొచ్చిన పని అయిపోయింది. వైజాగ్ వెళుతున్నాను. స్టేషన్ దాకా తోడు రాగలవా?"

అమ్మో, ఎవరైనా చూస్తే, ఇంకేమైనా ఉందా? పరిచ యస్తులు ఎందరో కనిపిస్తారు. ఊహూ, ఈమెకు తోడు వెళ్ళను గాక వెళ్ళను. నిక్కచ్చిగా చెప్పేశాను ఆమెతో. ఇంతకు మునుపు ప్రపంచమే పట్టనట్లు, ఆమెతో తిరిగిన వాడినని, ఆ క్షణం గుర్తుకు వచ్చి, నా ఆత్మ నన్నే హేళన చేసినట్లు అనిపించింది.

ఒంటరిగా ఆమె ఒక్కతే వెళ్ళిపోయింది. 'పీడా పోయింది' అనుకున్నాను నేను.

*****

రాజ్యలక్ష్మి వెళ్ళిన వారం రోజులకి ఓ పెద్ద ఉత్తరమే వ్రాసింది. అదంతా చదివిన నేను మతిలేని వాడిన య్యాను.

"విశ్వం! నేనేదో దీనంగా, దయనీయంగా ఓ కథ వినిపిస్తానని నీవు ఖచ్చితంగా అనుకోవచ్చు. అంతక న్నా ఉన్నతమైన ఆలోచనలు నీకు వస్తాయంటే 'ఛస్తే' నమ్మను నేను.

'మీతో పరిచయం స్వల్పం,
మైత్రికి హృదయం ముఖ్యం
అందుకే మిమ్మల్ని బాగా ఎరుగుదునన్నది సత్యం,
కృత్రిమమైన మనసులూ...మాటలూ
కిచాటుగా నిండిపోయిన లోకంలో
నిజాయితీగా నిండుగా పలికే గొంతు
నిజంగా ఎంతో అవసరం"

ఎంత చక్కగా రాశాడు తిలక్. ఎప్పుడూ నేనను కుంటుండే దాన్ని. విశ్వం ఓ మంచి మిత్రుడు, గొప్ప భావుకుడు అని.

కానీ విశ్వం! సుమానికి సౌరభం ఉంటేనే అది గుభాళిస్తుంది. అలాగే భావుకునికి విశాల దృక్పథం...ఓ గొప్ప మనసు ఉండాలి. అతనెప్పుడూ కుసంస్కారి కాకూడదు. అప్పుడే, వాళ్ళు నిజమైన భావుకులు, కళాకారులు కూడా. కానీ, అదే నీలో లోపించింది. నా భర్తకూ, నీకూ ఎందులోనూ తేడా లేదనిపించింది.

నూటికి తొంభైశాతం పురుషుడెప్పుడూ స్త్రీ లోని గొప్పదనాన్ని భరించలేడు. కవిత్వాల్లో వరూధినినీ, సత్య భామనీ గౌరవించే పురుషుడు, నిజ జీవితంలో సత్యభా మని క్షణమైనా సహించలేడు. వరూధినిని ఏనాడూ వరించలేడు. చలం నవలల్ని అభిమానించి, ఆహా...ఓ హెూ అని చప్పట్లు చరిచే పాఠకులు వాస్తవంలో శశిరేఖల్నీ, అమీనాల్నీ అంగీకరించలేరు. 'బుచ్చిబా బు'ని పిచ్చిబాబుని చేసిందని విమలపై కత్తి గడ్తారు.

ఎందుకు విశ్వం ఇన్ని మాటలు? ఆ రోజు ప్రోగ్రామ్‌లో నన్ను నా ఆలోచనా సరళిని, నా విమర్శనా దృక్పథాన్ని పొగిడి ఆకాశానికెత్తేశావు. కానీ, నేడు నా ఉనికినే భరించ లేకుండా ఉన్నావు.

పొరబడింది నేను. నిన్నో స్నేహితుడుగా భావించానే... అందుకు బాధపడాలి నేను. అంతే కాని, నన్ను దూరం చేశావని కాదు. నీలాంటి జనం "చ్ఛాలా" పవిత్రంగా జీవిస్తారు. స్త్రీలోని మార్దవాన్ని ముందడుగు వేసే ధోరణిని ఆమెలో కనిపించే వెలుగుని చూసి సహించలేరు.

కానీ విశ్వం, చాలా వరకు నా భర్తే నయం. అతని రూపం ఎంత వికృతమో, అతని నడత అంతే. కానీ సురూపివైనా, నీవు గోముఖ వ్యాఘ్రానివి. నా భర్త లాంటి వాళ్ళతో ఎప్పుడూ ప్రమాదమే ఉండదు. ముందు గానే తప్పించుకోవచ్చు. అతను ఈ కళాత్మక భావనల్ని భావుకతని, హృదయ స్పందనల్ని ఎరుగని వాడైనా, అన్నిటినీ మించి ఓ శాడిస్ట్ అయినా, ఈ క్షణంలో నేనతన్ని క్షమించగలను. కానీ నీవు ప్రాజ్ఞతమాటున భయంకరమైన సంకుచితత్వాన్ని కలిగి ఉన్నావు. ఎదుటి మనసుల్ని గాయపరిచే హీనమైన బుద్ధి నీకుంది.

నేడు, మునుపటి కట్టుబాట్లు తెగాయి. మూఢాచారా లూ తగ్గాయి. పురుషుడు స్త్రీని గౌరవించే రోజులు సమాన హక్కుల్ని చాటే రోజులు వచ్చాయి. కానీ, మరో వైపు సమాజంలో ఇంకా, పూర్వకాలంకన్నా భయంకర మైన సంకెళ్ళు వేసే నీలాంటి జనం ఉన్నారు. సంతో షించాలో దుఃఖించాలో తెలియని పరిస్థితి. రియల్లీ మనమంతా ఓ కన్ఫ్యూజన్ విష వలయంలో కొట్టుకుని పోతున్నాం.

చూడు విశ్వం! నాలోని స్నేహ తుషారజల్లుల్ని ఓ తుపానులా భావించి, నన్నూ నా హృదయాన్ని అనుమా నించి, అవమానించి స్నేహ కానుకగా సమర్పించావ్. అసలా అధికారం నీకు ఎక్కడిది. ఓమాట... నిన్ను అభిమానించి, స్నేహించిక స్త్రీని ఎప్పుడూ, ఏనాడూ చులకనగా చూడకు. ఆదరించటం నేర్చుకో. ఏది ఏమైనా, ఎప్పటికీ నీ క్షమాపణలు గానీ, సంజాయిషీలు గాని చెప్పటానికి ప్రయత్నించకు. నా పేరు 'రాజీ'నే గాని.. నేనెప్పుడూ మీ సమాజంలో రాజీ పడలేను. గుడ్ బై ఫరెవర్.

'రాజ్యలక్ష్మి'

ఎప్పుడూ 'రాజ' అని ముగించేది లేఖల్లో. ఆ క్షణంలో నా మీద నాకే అసహ్యం. నా హిపోక్రసీతో ఓ అమృతమూ ర్తిని, రాగమయిని, స్నేహమయిని పోగొట్టుకున్నాను. నన్ను నేనే క్షమించుకోలేని సంఘటన ఇది. ఎంతో సహనం గల ధరణే నన్ను పరిహసించి, నావైపు నీచుబ్ధి చూసినట్లుగా చూసిందన్న ఫీలింగ్...